క్లుప్తంగా

మల్లికార్జునస్వామి కల్యాణం



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌ 14వ డివిజన్‌ లక్ష్మీపురంలోని పుట్ట నాగమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ సతీమణి మనాలీ ఠాకూర్‌ కల్యాణోత్సవంలో పాల్గొనగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రైతులను ఆదుకోవాలి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్‌: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి ప్రభుత్వం రూ.40వేలు పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి డిమాండ్‌ చేశారు. మండలంలోని అంకంపల్లిలో అకాల వర్షానికి నేలవాలిన మొక్కజొన్న పంటను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం వెంటనే రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

కుట్టుశిక్షణ తరగతులు ప్రారంభం



కుట్టు శిక్షణ ఇస్తున్న శిక్షకులు

కమాన్‌పూర్‌: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహ టైలరింగ్‌ కోఆప్షన్‌ సొసైటీలో మహిళా సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆదివారం డీఆర్‌డీఏ పీడీ కాళిందిని ప్రారంభించారు. శిక్షణ తరగతులను విక్టరీ ఫ్యాషన్‌ డిజైనర్‌ సంస్థ శిక్షణ ఇస్తుందని పీడీ తెలిపారు.

చండీసహిత హోమయజ్ఞం



పెద్దపల్లిరూరల్‌: పట్టణంలోని పాతబజార్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీమహాలక్ష్మి గణపతి చండీసహిత హోమయజ్ఞం నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి బసవత్తుల రాజమౌళ్యాచార్యులు, శ్రీకాంతేంద్రస్వామి, భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన హోమయజ్ఞంలో పలువురు దంపతులు పాల్గొన్నారు.

చెత్తతో నిండిన డ్రైనేజీ ఇబ్బందుల్లో ప్రజలు



ధర్మారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డు నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుపక్కన ఉన్న డ్రైనేజీ చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధంతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రైల్వేగేటు తిప్పలు తప్పేదెన్నడు?

- అమలుకు నోచుకోని రైల్వే అండర్‌ బ్రిడ్జి నిర్మాణం
- ప్రతిపాదనలు, సర్వేలకే పరిమితం
- కన్నాల రైల్వేగేట్‌తో ఇబ్బందుల్లో రెండు మండలాల ప్రజలు



కన్నాల రైల్వేగేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల బోడగుట్టపల్లి గ్రామ శివారులో గల రైల్వేగేటుతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వేగేట్‌ ఇబ్బందులను తొలగించేందుకు సమీపంలోనే రైల్వే అండర్‌ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసి దశాబ్దం గడిచినా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. దీంతో ఉమ్మడి కన్నాల గ్రామ పంచాయతీ పరిధి ప్రజలతో పాటు ప్రధాన రోడ్డుపై ప్రయాణించే వారికి తిప్పలు తప్పడం లేదు. దశాబ్దకాలంగా పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప తమ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఇబ్బందుల్లో రెండు మండలాల ప్రజలు..

కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని బోడగుట్టపల్లి గ్రామశివారులో ఉన్న రైల్వే గేటుతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 10అనుబంధ గ్రామాలు ఉండగా వాటిలో కన్నాల, నక్కిరెడ్డిపల్లి, శాలపల్లి, పాత లంబాడితండా గ్రామాలు గేటు అవతల ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు బ్యాంకింగ్‌, పోస్టాఫీస్‌, పోలీస్‌స్టేషన్‌, ఆసుపత్రి పనులు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు రావాలన్నా గేటు దాటాల్సిందే. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు స్థానిక కేశోరాం సిమెంట్‌ కర్మాగారంలో విధులు నిర్వహించే ఉద్యోగులు సైతం ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటారు. దీనికి తోడు గోదావరిఖని, ఎల్కలపల్లి, ఎఫ్‌సీఐ, యైటింక్లయిన్‌కాలనీ, కమాన్‌పూర్‌ మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఈమార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. అయితే మార్గమధ్యంలో ఉన్న గేటు మూలంగా వారికి ఇక్కట్లు తప్పడం లేదు. దక్షిణమధ్య రైల్వే లైన్‌ కావడంతో నిత్యం రైళ్లరాకపోకలతో బిజీగా ఉంటుంది. ఒక్కోసారి గంటల తరబడి గేట్‌ వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి.

మంత్రిపైనే ఆశలు..

మంథని ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న శ్రీధర్‌బాబు మంత్రిగా కొనసాగుతున్న నేపథ్యంలో స్థానికులు ఈ సమస్య పరిష్కారానికి ఆయనపైనే ఆశలు పెట్టుకున్నారు. మంత్రితో పాటు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుంటే స్థానికంగా రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం సాధ్యమేనన్నారు. స్థానికంగా బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డును కూడా విస్తరించి డబుల్‌రోడ్డు నిర్మాణం చేపడితే మంథని, రామగుండం నియోజకవర్గ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మంత్రితోనే సమస్య పరిష్కారం



మా గ్రామానికి రైల్వే గేటు పెద్ద సమస్యగా మారింది. దాదాపు దశాబ్దకాలంగా రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం సర్వేలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి సమస్య గురించి వివరించాం. ఎలాంటి స్పందన లేదు. నిత్యం రాకపోకలతో బిజీగా ఉండే కన్నాల రహదారికి అండర్‌ బ్రిడ్జి ఏర్పాటు ఎంతో అవసరం. ఈ విషయమై జిల్లా మంత్రి, మా నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలి.

– మల్క చంద్రకళ, మాజీ సర్పంచ్‌, కన్నాల

అవస్థలు పడుతున్నాం



మా గ్రామంతో పాటు మండల పరిధిలోని దాదాపు పది గ్రామాల ప్రజలకు సంబంధించిన ఈ రోడ్డులో ఉన్న రైల్వేగేట్‌ మూలంగా ఎన్నో అవస్థలు పడుతున్నాం. ఆసుపత్రి, మండల కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌తో పాటు ఏ ఇతర పనులకు వెళ్లాలన్నా రైల్వేగేటు దాటాల్సిందే. రైల్వేగేటు మూలంగా సకాలంలో పనులకు వెళ్లలేకపోతున్నాం. ఒక్కోసారి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు సకాలంలో వారి గమ్యాలకు చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

– కాదాసు తిరుపతి, రాణాపూర్‌

ప్రతిపాదనలకే పరిమితమైంది



రైల్వేగేటు వద్ద అండర్‌ బ్రిడ్జి నిర్మాణ అంశం దాదాపు పదిసంవత్సరాలుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈగేట్‌ మూలంగా ఎన్నో గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అయితే బాధలు వర్ణనాతీతం, అధికారులు, పాలకులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

– పుట్ట రంజిత్‌, శాలపల్లి



రామగుండం: కుందనపల్లిలో..



జ్యోతినగర్‌: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



ఎలిగేడు: ధూళికట్టలో బోనాలతో మహిళలు



సుల్తానాబాద్‌రూరల్‌: బోనాలతో మహిళలు



కమాన్‌పూర్‌: గుండారంలో..



జూలపల్లి: వద్యాపూర్‌లో..

వైభవంగా పోచమ్మ బోనాలు

రామగుండం: అంతర్గాం మండల పరిధి కుందనపల్లిలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఎన్టీపీసీ జ్యోతినగర్‌ పట్టణ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లి బోనాలు నిర్వహించారు.

ఎలిగేడు: గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీరేణుకఎల్లమ్మ తల్లి పట్నాలు ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ముప్పిరితోటలో గౌడసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. 25న ఎల్లమ్మతల్లికి బోనాలు, 26న బుధవారం ఎల్లమ్మతల్లికి లగ్నపట్నం, నాగవెల్లి పట్నం, మొక్కుబడి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు, గౌడ సంఘం అధ్యక్షుడు పూరెల్ల శ్రీనివాస్‌గౌడ్‌, ఉపాధ్యక్షుడు రంగు కొమురయ్య తెలిపారు.

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో మాదిగ కులస్తుల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించారు.

కమాన్‌పూర్‌: మండలంలోని గుండారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా బోనాలు నిర్వహించినట్లు సంఘం పెద్దలు తెలిపారు.

సుల్తానాబాద్‌రూరల్‌: పట్టణంలోని గౌడసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనం చొప్పున మహిళలు పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

జూలపల్లి: మండలంలోని మూడు గ్రామాల్లో పోచమ్మతల్లికి బోనాలు నిర్వహించారు. వద్యాపూర్‌లో వాలివాహన సంక్షేమ సంఘం, పెద్దాపూర్‌లో మాల సంక్షేమ సంఘం, కుమ్మరికుంటలో చిడతల రామాయణం కళాకారులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. బీఆర్‌ఎస్‌ నాయకుడు రఘువీర్‌సింగ్‌, నాయకులు సురేశ్‌రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించారు.

సంక్షిప్త వార్తలు

• సెల్‌ఫోన్‌ అప్పగింత

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధి ఓదెలకు చెందిన వెలిశోజు శ్రీనివాస్‌ పోగొట్టుకున్న ఫోన్‌ను ఎస్సై దికొండ రమేశ్‌ ఆదివారం అప్పగించారు. ఎస్సై వివరాల ప్రకారం శ్రీనివాస్‌ సెల్‌ఫోన్‌ ఇటీవల పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సెల్‌ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి అందజేశారు.

• కేటీఆర్‌ సమావేశానికి తరలిన శ్రేణులు

పెద్దపల్లిరూరల్‌: కరీంనగర్‌లో ఆదివారం మాజీ మంత్రి కేటీఆర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్‌ రజతోత్సవ సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు పెద్దపల్లి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు ఉప్పు రాజ్‌కుమార్‌, మర్కు లక్ష్మణ్‌ ఉన్నారు.

• సహజ కవయిత్రి రాజేశ్వరికి సత్కారం

పెద్దపల్లిరూరల్‌: పట్టణానికి చెందిన సహజ కవయిత్రి బొమ్మిదేని రాజేశ్వరికి హాస్యనటులు ఆర్‌ఎస్‌ నంద, సీతామహాలక్ష్మి ఆదివారం ప్రశంస పత్రం, మెమొంటో అందజేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో రిటైర్డ్‌ ఉద్యోగుల భవన్‌లో ఉగాది పురస్కారాల సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. రాజేశ్వరి రాసి పాడిన 'మంచితనం పెంచుకుందాం' అనే కవితకు ఆదరణ లభించింది.

• మధ్యాహ్న భోజన వంటపాత్రల పంపిణీ

సుల్తానాబాద్‌రూరల్‌: మండలంలోని ప్రభుత్వ స్కూళ్లకు మధ్యాహ్న భోజనం వంటపాత్రలు రాష్ట్ర ప్రభుత్వం అందించగా ఆయా పాఠశాలలకు సామగ్రి అందించినట్లు ఎంఈవో రాజయ్య తెలిపారు.

• ఎమ్మెల్యేకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి మాదిగ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను సన్మానించారు. ఎస్సీ వర్గీకరణలో కీలకంగా వ్యవహరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు దుర్గాప్రసాద్‌, మోహన్‌, శ్రావణ్‌కుమార్‌, రమేశ్‌, లక్ష్మీరాజం, రాములు, చంద్రమొగిలి, కిష్టయ్య, శంకర్‌ పాల్గొన్నారు.

మంత్రిని విమర్శిస్తే గుణపాఠం తప్పదు

రామగిరి: కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబును విమర్శిస్తే ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని కాంగ్రెస్‌ నాయకులు అన్నారు. మండలంలోని సెంటినరీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు తిరుపతియాదవ్‌, బాపు, శ్రీనివాస్‌, సత్యం, తులసీరాం, కొమురయ్య, రామ్మూర్తి, మైదం వరప్రసాద్‌ పాల్గొన్నారు.


ఏసీపీకి నూకాంబిక జాతర ఆహ్వాన పత్రిక



ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో 29న నిర్వహించే నూకాంబిక (పోచమ్మ) జాతరకు కుటుంబ సమేతంగా హాజరుకావాలని, బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదివారం గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌ జమ్ముల రామారావు, ఇండిబిల్లి రవీందర్‌, రాజేశ్‌, బొంతు రఘు ఉన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి



మొక్కులు చెల్లిస్తున్న కళాకారులు

జూలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న ప్రాచీన కళలకు జీవం పోసి కాపాడుకోవాలని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దారబోయిన నర్సింహయాదవ్‌ అన్నారు. మండలంలోని కుమ్మరికుంటలో ఈ నెల 30 నుంచి చిడతల రామాయణం ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. కాగా కళాకారులు ఆదివారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ముఖ్య అతిథిగా నర్సింహయాదవ్‌ పాల్గొని తనవంతుగా రూ.5,016 అందించారు. కళాకారులు కామ రాజు, కుంట రాజేశ్వర్‌రెడ్డి, శాతల్ల కాంతయ్య, సాదుల రాజయ్య, దిడ్డి శంకరయ్య, పొన్నం రమేశ్‌, ఈర్ల స్వామి, చీకట్ల కుమార్‌, కుమార్‌, శిక్షకులు శ్రీనివాస్‌ ఉన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

సుల్తానాబాద్‌రూరల్‌: రైతులకు మల్టీపర్పస్‌ సేవలందించడంతో పాటు సంఘం ముందంజలో నిలవడం సంతోషమని, కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌ మండలంలోని చిన్నకల్వల ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం సింగిల్‌విండో చైర్మన్‌ మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సంఘానికి ఓ గోదాం, అవసరాల నిమిత్తం భూమి కేటాయించాలని చైర్మన్‌, సీఈవో రమేశ్‌ కోరగా స్పందించిన ఎమ్మెల్యే కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎల్‌వోసీ పత్రం అందజేత

కాల్వశ్రీరాంపూర్‌: మండలంలోని తారుపల్లికి చెందిన అనసూయ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరింది. ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయక నిధి నుంచి రూ.75వేల విలువైన ఎల్‌వోసీని ఆదివారం ఎమ్మెల్యే విజయరమణారావు బాధిత కుటుంబసభ్యులకు అందించారు. కాంగ్రెస్‌ నాయకులు సారయ్యగౌడ్‌, సునీల్‌రావు, రమేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న ఎమ్మెల్యేలు



పెద్దపల్లిరూరల్‌: ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు



గోదావరిఖనిటౌన్‌: పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌

పెద్దపల్లిరూరల్‌: పట్టణంలో ఎమ్మెల్యే విజయరమణారావు ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గోదావరిఖనిటౌన్‌: రంజాన్‌ పండుగ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని అహలె హదీస్‌ ఈద్గాలో ఆదివారం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ ఇఫ్తార్‌ విందులో పాల్గొన్నారు. రామగుండం తహసీల్దార్‌ కుమారస్వామి, మజీద్‌ కమిటీ నాయకులు, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ వర్ధంతి



గోదావరిఖని: కాగడాలతో ర్యాలీ



రామగుండం: అంతర్గాంలోని ఎగ్లాస్‌పూర్‌లో..



జ్యోతినగర్‌: కాగడాల ప్రదర్శన

గోదావరిఖని: భగత్‌సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. నాయకులు ఐ.కృష్ణ, ధర్మేందర్‌, నరేశ్‌, రామకృష్ణ, రాజేశ్‌, రాజన్న పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంతో పాటు ఎగ్లాస్‌పూర్‌లో ఆదివారం భగత్‌సింగ్‌ వర్ధంతి నిర్వహించారు. పీవైఎల్‌, పీడీఎస్‌యూ, సీపీఐ(ఎంఎల్‌)మాస్‌లైన్‌ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పీవైఎల్‌ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్‌, కొట్టె తిరుపతి, గుమ్మడి వెంకన్న, తీగుట్ల రాములు పాల్గొన్నారు. ఎన్టీపీసీ భగత్‌సింగ్‌ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, ముత్తునూరి సంపత్‌, నర్సింహాచారి, ఉపేందర్‌, తిరుపతి, అయిల రవి, మార్త సంపత్‌, హలీంబేగ్‌, సారమ్మ పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో కాగడాల ప్రదర్శన

జ్యోతినగర్‌: భగత్‌సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఎన్టీపీసీ ఐఎఫ్‌టీయూ, సీపీఐఎంఎల్‌ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీపీసీ ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచి అన్నపూర్ణకాలనీ వీధుల గుండా మేడిపల్లి చౌరస్తా వరకు కాగడాలతో ప్రదర్శన చేశారు. ఈనెల 30 వరకు నిర్వహించే వర్ధంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఐఎఫ్‌టీయూ నాయకులు బుచ్చన్న, కుమార్‌, సీపీఐఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు స్వామి, రాయమల్లు, రాజయ్య, రవి, రమేశ్‌, సురేశ్‌, స్వామి, చందు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మంథని: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



ముత్తారం: అడవిశ్రీరాంపూర్‌లో..

మంథని: మంథని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్‌ జెడ్పీ పాఠశాలలో 1988–89 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు.

ఆర్జీ–2లో ఐదుగురు అధికారులు బదిలీ

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలో ఐదుగురు మైనింగ్‌ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. వకీల్‌పల్లిగనిలో పనిచేస్తున్న అడిషనల్‌ మేనేజర్‌ నీలేష్‌మహేంద్ర, డిప్యూటీ మేనేజర్‌ బిల్ల ప్రభును ఓసీపీ–3 ప్రాజెక్టుకు బదిలీ చేశారు. అలాగే జీడీకే–7ఎల్‌ఈపీ గనిలో పనిచేస్తున్న సీనియర్‌ అండర్‌ మేనేజర్‌ పాల నరేశ్‌, షేక్‌ జాహిద్‌ అస్లాం, డీవైఎస్‌ఈగా పనిచేస్తున్న జి.రామకృష్ణను ఓసీపీ–3కి బదిలీ చేశారు.

ఎస్టేట్‌ అధికారులు..

సంస్థవ్యాప్తంగా ముగ్గురు ఎస్టేట్‌ అధికారులను యాజమాన్యం ఆదివారం బదిలీ చేసింది. భూపాల్‌పల్లి ఎస్టేట్‌ విభాగంలో పనిచేస్తున్న జూనియర్‌ ఎస్టేట్‌ ఆఫీసర్‌ వి.దీపక్‌ను కార్పొరేట్‌ ఎస్టేట్‌ విభాగానికి, కార్పొరేట్‌ ఎస్టేట్‌లో పనిచేస్తున్న అజ్మీర శశాంక్‌ను భూపాల్‌పల్లి ఎస్టేట్‌ అధికారిగా, అదేవిధంగా కార్పొరేట్‌ ఎస్టేట్‌ విభాగంలో పనిచేస్తున్న సి.మణిదీప్‌రెడ్డిని ఆర్జీ–3 ఎస్టేట్‌ విభాగానికి బదిలీ చేశారు.